క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో దోష నివారణ పూజలు



విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ

కడప కల్చరల్ : కడప నగరంలోని విజయదుర్గాదేవి ఆలయంలో భక్తులు మంగళవారం దోష నివారణ పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని.. ఆలయ ప్రాంగణంలో సామూహికంగా దోష నివారణ పూజలు జరిపారు. భక్తులు ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో నిమ్మకాయ దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కడప రాయుడికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం



స్వామి, అమ్మవార్లకు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేస్తున్న అర్చకుడు

కడప కల్చరల్ : తిరుమలేశుని తొలి గడప దేవుని కడప లక్ష్మీ వేంకటేశ్వరస్వామికి మంగళవారం పునర్వసు పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ధనుర్మాసంలో కడప రాయుడి అభిషేకాన్ని తిలకించడం పుణ్యదాయకంగా భావించిన స్థానికులు విశేష సంఖ్యలో హాజరై పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అభిషేక ద్రవ్యాలను అందజేశారు.

రేపు అమరవీరుల వర్ధంతి సభ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈ నెల 19వ తేదీన(గురువారం) పండిట్ రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లాఖాన్ వర్ధంతి నిర్వహిస్తున్నట్లు ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మక్బూల్ బాషా పేర్కొన్నారు. స్థానిక ఆప్‌కీ ఆవాజ్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలు మరవరాదని, తెల్ల దొరలను తరిమి వేసిన మహానుభావులను స్మరించుకోవాలన్నారు.

పరుగు పందెంలో ప్రతిభ



ఆర్టీసీ ఉద్యోగి మంజులను అభినందిస్తున్న కార్మిక పరిషత్ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : పరుగు పందెం క్రీడల్లో బంగారు పతకం సాధించిన ఏపీఎస్ఆర్టీసీ కడప డిపో ట్రాఫిక్ సూపరింటెండెంట్ మంజులను కార్మిక పరిషత్ నాయకులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక పరిషత్ అధ్యక్షుడు ఆకుల కిషోర్‌బాబు, డిపో కార్యదర్శి బి.రాజేంద్రరెడ్డి, మెకానికల్ ఇన్‌ఛార్జి సెక్రెటరి చంద్రశేఖర్, జిల్లా ప్రెసిడెంట్ ఏపీఎస్.రెడ్డి, సీఆర్.ఆంజనేయులు, ఎస్‌హెచ్.వలి, ఏడీసీ.లలిత నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఏపీబిఈఈయూ డిస్కం ప్రెసిడెంట్‌గా వెంకటేష్



కడప కార్పొరేషన్ : ఆంధ్ర ప్రదేశ్ బహుజన ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ డిస్కం ప్రెసిడెంట్‌గా లైన్‌మెన్ కె.వెంకటేష్‌ను నియమిస్తూ ఆ యూనియన్ స్టేట్ జనరల్ సెక్రటరీ టి.అంజయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ యూనియన్ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్.సుధాకర్, పి.మల్లికార్జున, రాజా, రమేష్‌బాబు, సురేష్ హర్షం వ్యక్తం చేశారు.

ఉస్తాద్ మరణం బాధాకరం

కడప కల్చరల్: ప్రముఖ తబలా విద్వాంసులు ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ మరణం సంగీత అభిమానులకు తీరని లోటు అని నగర ప్రముఖులు అన్నారు. నగరంలో జాకీర్ హుస్సేన్ చిత్రపటానికి పూలమాలవేసి మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జాకీర్ హుస్సేన్ తబలా వాయిద్యానికి ప్రపంచ స్థాయిలోగుర్తింపు, గౌరవం సంతరించి పెట్టారన్నారు. తనదైన తబలా విన్యాసాలతో భారతీయ సంగీత వైభవాన్ని చాటి చెప్పారన్నారు. ప్రముఖ సంగీత జ్ఞులెందరో అభిమానులుగా మారడం వెనుక ఆయన కృషి ఎంతో ఉందన్నారు. అమీర్‌బాబు, కరీముల్లా, నాసర్ అలీ, నూర్ భాషా, ఏజాస్. ఆదిల్. తౌసిఫ్ పాల్గొన్నారు.

న్యాక్‌కు..సర్వం సిద్ధం

జిల్లాలో యువతకు ఉన్నత విద్యనందించాలనే లక్ష్యంతో 1948లో ఏర్పాటైన కళాశాల.. న్యాక్ గ్రేడింగ్ కోసం సన్నద్ధమైంది. ఎందరో విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా, ఐఏఎస్, ఐపీఎస్, ఎమ్మెల్యేలు, మంత్రులుగా తీర్చిదిద్దిన చదువుల కోవెల నేడు న్యాక్ గ్రేడింగ్ కోసం సిద్ధమవుతోంది.

నేడు న్యాక్ పీర్ కమిటీ రాక

కళాశాల వివరాలు (అంకెల్లో)..

1948లో	ప్రస్తుత జెడ్పీ ఆవరణలో కళాశాల ఏర్పాటు
1954లో	గవర్నమెంట్ ఆర్ట్స్ కళాశాలలో తరగతులు ప్రారంభం
1967లో	2(ఎఫ్), 12(బి) హోదా
2003-04లో	కళాశాలకు తొలిసారిగా బి ప్లస్ ప్లస్ గ్రేడింగ్
2013, 2019లో	బి గ్రేడ్



కడప ప్రభుత్వ కళాశాల ముఖద్వారం

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల(స్వయంప్రతిపత్తి) నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) గ్రేడింగ్ పొందేందుకు వడివడిగా అడుగులు వేస్తూ సన్నద్ధమైంది. ఈ నెల 18, 19వ తేదీల్లో నాక్ పీర్ కమిటీ కళాశాలను పరిశీలించనుండంతో గత కొద్ది రోజులుగా అలుపులేకుండా కళాశాల పనుల్లో యంత్రాంగం నిమగ్నమైంది. న్యాక్ కమిటీ కోసం అన్ని విభాగాల ప్రగతి నివేదికలు తయారుచేయడంతోపాటు అందంగా ముస్తాబుచేస్తున్నారు.

న్యాక్.. గ్రేడింగ్ వస్తే..

ఉన్నత విద్య అందించే విద్యాలయాలు.. సతులు, సౌకర్యాల కల్పన, తదితర అంశాల్లో పరిమాణం, నాణ్యతను పరిశీలించి వారు అందించిన నివేదిక ప్రకారం క్యుములేటివ్ గ్రేడ్ పాయింట్ ఆవరేజ్(సీజీపీఏ) ఆధారంగా గ్రేడ్ కేటాయిస్తారు. ఈ గ్రేడింగ్ కమిటీ రావడంతో విద్యాలయాల బలాలు, బలహీనతలను బేరీజు వేసుకుని సరిదిద్దుకునే అవకాశం లభిస్తుంది. న్యాక్ కమిటీ పరిశీలన అనంతరం గ్రేడింగ్ ఇస్తారు. ఈ గ్రేడింగ్ ఆధారంగా కళాశాలకు నిధుల మంజూరు, స్వయంప్రతిపత్తి హోదా లభిస్తాయి.

ఆచార్య రాజీవ్ జైన్ నేతృత్వంలో..

రాజస్థాన్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార రాజీవ్ జైన్ నేతృత్వంలో న్యాక్ పీర్ బృందం ఈ నెల 18, 19వ తేదీల్లో కళాశాలను పరిశీలించనుంది. ఈయనతో పాటు మెంబర్ కో ఆర్డినేటర్‌గా అలహాబాద్ విశ్వవిద్యాలయం ఆచార్యులు డా. మధురేంద్ర కుమార్, కొల్హాపూర్ వివేకానంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.రమేష్ కుంభార్, కడప ఆర్‌జేడీ డా.ఆర్.దేవిడ్‌కుమార్ స్వామి సభ్యులుగా కొనసాగుతారు.

> **ఏ గ్రేడ్ సాధించాలని..**
>
> 
>
> జిల్లాలోనే తొలి కళాశాలగా ఉన్న ప్రభుత్వ పురుషుల కళాశాల అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తోంది. కళాశాలకు ఎ గ్రేడ్ సాధించాలనే లక్ష్యంతో గత కొద్ది నెలలుగా అధ్యాపకులు, సిబ్బంది అవిశ్రాంతంగా శ్రమించారు. రెండురోజులపాటు కళాశాలలోని అన్ని విభాగాలను పీర్ కమిటీ సభ్యులు పరిశీలించి నివేదిక యూజీసీకి అందజేస్తారు. వారు కళాశాలకు గ్రేడింగ్ కేటాయిస్తారు.
>
> – డాక్టర్ జి. రవీంద్రనాథ్, ప్రిన్సిపల్, ప్రభుత్వ పురుషుల కళాశాల, కడప

గ్రేడింగ్ సాధించిన తొలి కళాశాలగా..

జిల్లాలో న్యాక్ అసెస్‌మెంట్ బీ ప్లస్ ప్లస్ గ్రేడ్ సాధించిన కళాశాల కడప ప్రభుత్వ పురుషుల కళాశాల. 2003లో తొలిసారిగా జిల్లాలో న్యాక్ గ్రేడ్ సాధించింది. అనంతరం మళ్లీ 2013లో గ్రేడ్ సాధించింది. 2018లో మూడోసారి న్యాక్ పూర్తవగా, తాజాగా నాలుగో సైకిల్ కింద ఈ నెల 18, 19వ తేదీల్లో న్యాక్ కమిటీ రానుంది. ఈ సారి ఎ గ్రేడ్ సాధించేందుకు అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధమయ్యారు. కళాశాల భవనానికి రంగులద్ది, అన్ని విభాగాలను ఆధునీకరించి ప్రగతి నివేదికను సిద్ధం చేశారు.

టగ్ ఆఫ్ వార్‌లో విద్యార్థినుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో «టగ్ ఆఫ్ వార్» క్రీడల్లో కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. ఈ నెల 14, 15వ తేదీల్లో ప్రొద్దుటూరు వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో తమ కళాశాల క్రీడాకారిణులు విజేతలుగా నిలిచి ప్రతిభ చూపిన విద్యార్థినులను ప్రిన్సిపల్ డా.వి.సలీంబాషా మంగళవారం అభినందించారు. రానున్న రోజుల్లో మరిన్ని విజయాలను నమోదు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ మదన్ మోహన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేసి అభివృద్ధి చేయాలి

కమలాపురం : అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయాలని జడ్పీ సీఈఓ ఓబులమ్మ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ప్రజా ప్రతినిధులకు, అధికారులకు గ్రామాల సుస్థిరాభివృద్ధిపై జరుగుతున్న రెండో రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. ప్రతి గ్రామ పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రభుత్వం సూచించిన లక్ష్యాలను సాధిస్తే సుస్థిరాభివృద్ధి సాధించవచ్చన్నారు. ముందుగా మహిళలకు బ్యాంకుల్లో ఖాతాలు తెరిపించాలన్నారు. అలాగే రైతులను అన్ని విధాలుగా ప్రోత్సహించి భూమి ఉత్పాదకతను మెరుగు పరచాలన్నారు. ఎంపీడీఓ జ్యోతి మాట్లాడుతూ గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే ప్రభుత్వం 9 అంశాలతో కూడిన లక్ష్యాలను నిర్దేశించిందన్నారు. వాటిని సాధిస్తే సుస్థిరాభివృద్ధి సాధించవచ్చన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనర్స్ పలు అంశాలపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన

పెండ్లిమర్రి : కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఈనెల 27వ తేదీన పెండ్లిమర్రి మండలం వెల్లటూరు గ్రామంలో పర్యటిస్తున్నందున ఏర్పాట్లను మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్‌నాయక్‌లు పరిశీలించారు. మంత్రి పర్యటనలో డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు ప్రదర్శన, పంటలను పరిశీలిస్తారన్నారు. అలాగే వెల్లటూరు గ్రామ పొలాల్లో రైతులు సాగుచేసిన చామంతి, వేరుశనగ, మినుము పంటలను పరిశీలించి రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ నీలకఠారెడ్డి, ఏఓ ఓబులేసు, ఏపీఎం బాలస్వామి, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ



ఉపాధి పనులపై ఆరా తీస్తున్న అధికారులు

చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నె, బుసిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ ఆదిశేషారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులన్నీ నాణ్యతగా చేయాలని, సిమెంట్ రోడ్లు, పశువులషెడ్లు, ఫారం పాండ్‌లు త్వరగా పూర్తిచేయాలని, ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కమలాపురం ఏపీడీ సోమశేఖర్, ఏపీవో రామానుజులరెడ్డి పాల్గొన్నారు.

కేవీకే ద్వారా రైతులకు మెరుగైన సేవలు

విస్తరణ సంచాలకులు డాక్టర్.శివనారాయణ



కేవీకేలో ఆయిల్ తీసే యంత్రాన్ని పరిశీలిస్తున్న డాక్టర్. శివ నారాయణ

కడప అగ్రికల్చర్ : కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా రైతులకు మెరుగైన సేవలందించి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని గుంటూరు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్.శివనారాయణ పేర్కొన్నారు. ఊటకూరు కృషి విజ్ఞాన కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. కేవీకేకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి సూచనలిచ్చారు. సాంకేతిక కార్యక్రమాలపై సిబ్బందితో సమీక్షించారు. కేవీకే నమూనా క్షేత్రంలో వర్మీ కంపోస్టు తయారీ కేంద్రం, పుట్టగొడుగుల పెంపక కేంద్రం, కోళ్లు, గొర్రెలు, మేకల పెంపక కేంద్రం, ఉద్యాన పంటల ప్రదర్శన క్షేత్రం, చిరుధాన్యాలకు విలువలు జోడింపు కేంద్రం పరిశీలించారు. యంత్ర పరికరాలను చూసి వివరాలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా రైతులకు తగిన శిక్షణ ఇచ్చి మంచి పంట దిగుబడులను సాధించేందుకు కృషి చేయాలని శాస్త్రవేత్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త డాక్టర్ వీరయ్య, ఏరువాక కేంద్ర సమన్వయకర్త డాక్టర్ అంకన్నకుమార్, కేవీకే శాస్త్రవేత్తలు మహేష్‌బాబు, సాయి మహేశ్వరి, మానస, సురేష్‌కుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ వీసీ ఆచార్య జి.విశ్వనాథకుమార్



మొక్కలు నాటే కార్యక్రమంలో వీసీ ఆచార్య జి.విశ్వనాథకుమార్, అధ్యాపకులు

ఏఎఫ్‌యూ : మొక్కలను నాటి వాటిని సంరక్షించే బాధ్యత అందరికీ ఉందని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.విశ్వనాథకుమార్ అన్నారు. కళాశాలల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించేందుకు మొక్కల పెంపకం ఒక్కటే ప్రత్యామ్నాయమార్గమన్నారు. భవిష్యత్ తరాలకు ఉత్తమ పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం వీసీ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్.రాజేష్‌కుమార్‌రెడ్డి, డా.ప్రసాద్‌రెడ్డి, డా.వరలక్ష్మి, వి.శివకృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మ నిరతితోనే దేశానికి మంచి పేరు





సభలో మాట్లాడుతున్న బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్, సభకు హాజరైన భక్తులు

కడప కల్చరల్ : ప్రపంచ వ్యాప్తంగా దేశానికి మంచి గుర్తింపు, గౌరవాలు లభించడానికి కారణం మన ప్రజలు ధర్మ నిరతి కలిగి ఉండడమేనని ఏలూరుకు చెందిన ప్రణవ పీఠాధిపతి బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ అన్నారు. సుముఖి అన్నపూర్ణేశ్వరి సేవా సమితి ఆధ్వర్యంలో కడప నగరం లోని అష్టలక్ష్మి కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రధాన ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవాన్ని విశ్వసించినట్లే దేశాన్ని గౌరవించాలని, దేశ రక్షణకు పాటుపడాలని సూచించారు. దైవభక్తి కలిగి ఉన్న సమాజంలోనే శాంతి, సౌఖ్యాలు విలసిల్లగలవని తెలిపారు. ధార్మిక చింతన ఉన్నప్పుడే సమాజం ప్రశాంతంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా నగర వాసులు ఆయనను ఘనంగా సత్కరించారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లా వ్యాప్తంగా సిమెంట్, సోలార్, ఆర్టీపీపీ, ఇతర పరిశ్రమలలో స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరణాల.శివకుమార్ పేర్కొన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని సిమెంటు పరిశ్రమలు జిల్లాలో ఉన్నాయన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో రెండు సోలార్ ప్లాంట్లు, ఎర్రగుంట్ల ఆర్టీపీపీ, బద్వేల్‌లో ప్లైవుడ్ పరిశ్రమలు, మరిన్ని చిన్న తరహా పరిశ్రమలు ఉన్నాయన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వర్కర్స్‌ను తెప్పించుకొని పని చేయించుకుంటున్నారని, దీంతో జిల్లా యువత ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయాయన్నారు. పరిశ్రమలలో భద్రత లేదని, పలు పరిశ్రమల్లో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి విజయ్, జిల్లా సహాయ కార్యదర్శి ఆదిల్ పాల్గొన్నారు.

బీమా చెల్లింపునకు డిసెంబరు 31 వరకు గడువు

కడప ఏడీఏ శంకర్‌నాయక్



గ్రామ సభలో మాట్లాడుతున్న ఏడీఏ శంకర్‌నాయక్

కడప అగ్రికల్చర్ : రబీలో వరిపంట సాగు చేసిన ప్రతి రైతు డిసెంబర్ 31వ తేదీలోపు ప్రీమియం చెల్లించాలని కడప ఏడీఏ శంకర్ నాయక్ సూచించారు. పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా నానాపల్లిలో మంగళవారం కడప ఏఓ సురేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ పంట సాగు చేసిన ప్రతి రైతు తమ పంటల వివరాలను తప్పకుండా నమోదుచేయించాలని తెలిపారు. దీంతోపాటు పది మంది రైతులు గ్రూపుగా ఏర్పడి రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేసుకుని అధిక ధరలకు అమ్ముకోవాలని సూచించారు. ఫీల్డ్ విజిట్‌లో భాగంగా ఉల్లి పంటను పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు మెహరాజ్, పావని, రైతులు పాల్గొన్నారు.

రోబోటిక్ టెక్నాలజీతో మోకాలి మార్పిడి చికిత్స



విలేకరులకు వివరిస్తున్న డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాయలసీమలో తొలిసారిగా రోబోటిక్ టెక్నాలజీతో పాక్షిక మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించామని డాక్టర్ విద్యా సాగర్‌రెడ్డి తెలిపారు. కడప నగరంలోని విద్యాసాగర్ ఆస్పత్రిలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ మోకాలిలో ఒక భాగం దెబ్బతిన్నపుడు పూర్తిగా మోకీళ్ల మార్పిడి చేయకుండా పాక్షికంగా అరిగిన భాగాన్ని మార్పిడి చేయవచ్చన్నారు. అత్యాధునిక రోబోటిక్ టెక్నాలజీ ఉపయోగించడం ద్వారా తాము ఆ ఘనత సాధించామన్నారు. సహజ సిద్ధమైన లిగమెంట్స్ పరిరరక్షించామని వివరించారు. ప్రజలు తమ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పీసీసీ అధ్యక్షురాలి జన్మదినం



కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: పీసీసీ అధ్యక్షురాలు షర్మిల జన్మదిన వేడుకను కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని అశోక్ నగర్‌లో డీసీసీ అధ్యక్షురాలు విజయ జ్యోతి కేక్ కట్ చేసి పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ అసెంబ్లీ కో–ఆర్డినేటర్ బండి కరయ్య, తదితరులు పాల్గొన్నారు.

- కడప నగర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో షర్మిల జన్మదినం సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్, మహ్మద్ అలీఖాన్, శ్యామలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రద్దీ సమయంలో వీధుల్లో చెత్త సేకరణ



కడప నగరంలో రద్దీ సమయంలో చెత్త సేకరణ చేయడంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. వేకువజామున చెత్త తీసుకెళ్లాల్సిన సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్ రద్దీ ఉన్న సమయంలో సేకరిస్తున్నారు. దీనికి తోడు రోడ్డు మధ్యన వాహనాల పార్కింగ్ ఉండడం, చెత్త సేకరణ లారీ ఎక్కువ సేపు నిలపడం కారణంగా వాహన దారులు ముందుకు వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారు. కమిషనర్ చొరవ చూపి ట్రాఫిక్ లేని సమయంలో సేకరించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు. – సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్

కన్నడ భాషలో వేమన పద్యాలు



కన్నడ భాషలో వేమన పద్యాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రెడ్డి సేవా సమితి ప్రతినిధులు

కడప కల్చరల్ : విశ్వకవి వేమన పద్యాలకు విస్తృత ప్రచారం కల్పించేందుకు ఆచార్య జి.శివారెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. కడప రెడ్డి సేవా సమితి సమావేశ మందిరంలో వేమన పద్యాల కన్నడ భాష పుస్తకాలను మంగళవారం సేవా సమితి అధ్యక్షులు లెక్కల కొండారెడ్డితో కలిసి ఆయన ఆవిష్కరించారు. మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ కర్ణాటక ధార్వాడ్ విశ్వవిద్యాలయం ప్రోత్సాహంతో వేమన పద్యాలను కన్నడ భాషలో మల్లేశప్పతో అనువాదం చేయించారన్నారు. వేమన దక్పథాన్ని సరికొత్త కోణంలో ఆవిష్కరించారని, తన పద్యాల్లో ఎరుక, బయలు అనే ప్రత్యేకమైన పదాలను చెప్పడం వల్ల వేమనను శూన్యవాదిగా చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో కుప్పిరెడ్డి నాగిరెడ్డి, గుడ్ల ఆదినారాయణ రెడ్డి, శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకష్ణ శాస్త్రి, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, డాక్టర్ చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో.. క్రిస్మస్ సందడి

ప్రస్తుతం క్రిస్మస్ పండుగ వాతావరణం ఎక్కడ చూసినా కనిపిస్తోంది. దీనికి ప్రధాన కారణం మార్కెట్ లో క్రిస్మస్ స్టార్, క్రిస్మస్ ట్రీల విక్రయాలు జోరుగా సాగడం. అంతే కాదు సాయంత్రం మార్కెట్‌లో ఈ స్టార్స్, ట్రీల విద్యుత్ కాంతుల వెలుగు అందరినీ కట్టి పడేస్తున్నాయి. స్టార్లు, ట్రీల కొనుగోళ్లు జోరందుకోవడంతో నగరంలో సందడి మొదలైంది.

- విద్యుత్తు కాంతులతో మెరుస్తున్న స్టార్లు, ట్రీలు
- 40కి పైగా దుకాణాల్లో అలంకార సామగ్రి విక్రయాలు



క్రిస్మస్ తాత శాంటాక్లాజ్ డ్రస్



స్టార్ కొనుగోలు చేస్తున్న ప్రజలు

కడప కల్చరల్ : క్రిస్మస్..క్రైస్తవులకు అతి పెద్ద పండుగ. ప్రజలను పాపాల నుంచి రక్షించడానికి సాక్షాత్తూ రక్షకుడే భూమిపై పుట్టిన రోజు క్రిస్మస్ పండగ. మరో వారం రోజులు ఉండగానే.. కడప నగరంలో సందడి మొదలైంది. క్రైస్తవుల ప్రాబల్యం గల వీధులు, చర్చిలలో పండగ కళ పెరుగుతోంది. మార్కెట్‌లో వారికి అవసరమయ్యే అలంకార సామగ్రి విక్రయాలు జోరందుకున్నాయి. చిన్నా, పెద్ద దుకాణాల్లోనూ ఇళ్లను అలంకరించే సామగ్రి కొనేందుకు పెద్దలతోపాటు యువత కూడా తమ అభిరుచి మేరకు పోటీ పడుతున్నారు. అవసరమైన సామగ్రిని హడావుడిగా కొంటున్నారు. వీరికి అనుగుణంగా మార్కెట్‌లో రంగు రంగుల క్రిస్మస్ స్టార్లు అందుబాటులో ఉన్నాయి. సాధారణ అలంకార సామగ్రితో పాటు కొత్తగా అందుబాటులోకి వచ్చిన నూతన వస్తువులను వ్యాపారులు అందుబాటులో ఉంచారు.

డిజిటల్ అలంకారాలపై మొగ్గు

ప్రత్యేకించి ఈ సంవత్సరం డిజిటల్ అలంకార సామగ్రి కొనుగోలు దారులను విశేషంగా ఆకట్టుకొంటోంది. క్రిస్మస్ సంప్రదాయ స్టార్లతో పాటు ఫైబర్ స్టార్లు అందుబాటులోకి వచ్చాయి. కొత్తగా ఉండడంతోపాటు కనువిందుగా ఉండడం, ధర కూడా తక్కువగా ఉండడం, వాటి నిర్వహణ సులభంగా ఉండడంతో కొనేందుకు ఇష్టపడుతున్నారు. దీంతో వాటికి మంచి డిమాండ్ ఏర్పడింది. సాధారణ రకాల స్టార్లు అమ్ముడు అవుతున్నట్టు తెలుస్తోంది.

సంప్రదాయ వస్తువులతో...

మార్కెట్లలో క్రిస్మస్ అలంకార సామగ్రి దాదాపు 30 రకాలకు పైగా అందుబాటులో ఉంటున్నాయి. సాధారణ స్టార్లు సైజును బట్టి రూ.250 నుంచి రూ.5 –6 వేల రూపాయల వరకు అందుబాటులో ఉన్నాయి. ఫైబర్ స్టార్లు రూ.250 నుంచి రూ. 3 వేల రూపాయల వరకు అందుబాటులో ఉన్నాయి. క్రిస్మస్ ట్రీలు సైజుల వారీగా లభిస్తున్నాయి. రూ.1500 నుంచి రూ. 10,000 ధర పలుకుతున్నాయి. ఒక్కొక్క చెట్టు ఆకులు, రెమ్మల సంఖ్యను బట్టి వాటి ధర ఉందిజ ప్రధానంగా క్రిస్మస్‌లో ఎక్కువగా సందడి చేసే క్రిస్మస్ తాత (శాంటా క్లాజ్)రెండు, మూడు సైజుల్లో రూ.500 నుంచి రూ.4000 ధరలో లభిస్తున్నాయి. కడప నగరంలోని ప్రధాన మార్కెట్ వైవీ స్ట్రీట్‌లో 40కి పైగా ఫ్యాన్సీ దుకాణాలు క్రిస్మస్ అలంకార సామగ్రితో కళకళలాడుతున్నాయి. జిల్లా అంతటా దాదాపు కోటిన్నర రూపాయల క్రిస్మస్ అలంకార సామాగ్రి విక్రయాలు జరుగుతాయని వ్యాపార వర్గాల అంచనా!